క్లుప్తంగా

శిథిలావస్థ ఇళ్ల కూల్చివేత



మహబూబాబాద్: కూలిపోయే దశలో ఉన్న ఇళ్ల లో నివాసం ఉండి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని టీపీఓ నవీన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జేసీబీతో శిథిలావస్థలో ఉన్న 15 ఇళ్లను కూల్చి వేశారు.

అదనపు గదులు ప్రారంభం

బయ్యారం: మండలంలోని కొత్తగూడెం యూపీఎస్ పాఠశాలలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన అదనపు గదులను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బిందు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ పూల్‌చంద్, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, హెచ్‌ఎం రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

వెంకన్నకు డాక్టరేట్



మహబూబాబాద్ అర్బన్: ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎల్ది వెంకన్నకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్‌ను బుధవారం అందజేసినట్లు తెలిపారు. డాక్టర్ అమిత్‌సింగ్లా పర్యవేక్షణలో 'కళాశాల విద్యార్థులపై సోషల్ నెట్‌వర్కింగ్ ప్రభావం– ది ఎంపిరికల్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను రాజస్థాన్‌కు చెందిన సన్‌రైజ్ యూనివర్శిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది.

జీఓ 58, 59లపై సర్వే

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని కొండపల్లి గోపాల్‌నగర్‌కాలనీలో బుధవారం వర్షంలోనూ అధికారులు జీఓ 58, 59పై సర్వే చేశారు. ఈసందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ జీఓ 58 కింద అర్హులైన వారందరికి ఉచిత పట్టాలివ్వాలన్నారు. జీఓ 59 పేరుతో పేదలపై ఆర్థికభారాన్ని మోపకుండా చూడాలన్నారు. నాయకులు పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

గార్ల: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకొని మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు ఎం.నాగమణి, అలువాల సత్యవతి, కె సుజాత, పద్మ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి



దంతాలపల్లి: మండలకేంద్రంలో బుధవారం కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మేకపోతుల రమణ, రాష్ట్ర కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు మండల గీత కార్మికులతో కలిసి సామాజిక చైతన్య యాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 2న బొలగాని పుల్లయ్య వర్ధంతి నుంచి 18న సర్వాయి పాపన్న జయంతి వరకు సామాజిక చైతన్య యాత్ర అమరుల యాదిలో పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్రకు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యామగాని వెంకన్న, జిల్లా నాయకులు మోహన్, మండల అధ్యక్షుడు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తున్న మంత్రి

తొర్రూరు: మండల ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి దయాకర్‌రావు విస్మరిస్తున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల రాంరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాంరెడ్డి మాట్లాడుతూ తొర్రూరు చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తానని, కంఠాయపాలెం చెరువు అలుగు పోసే ప్రాంతంలో బ్రిడ్జి నిర్మిస్తామని హామీలిచ్చిన మంత్రి వాటిని అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కందాడి అశోక్‌రెడ్డి, నాయకులు మేకల కుమార్, వెంకటాచారి, సుంచు సంతోష్, రవినాయక్, మధు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం

కురవి: విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలం అయ్యారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన పోరు జీపుయాత్ర భారీ వర్షంలో బుధవారం కురవికి చేరుకుంది. బాణాసంచా పేల్చి స్వాగతం పలికారు. యాత్ర 200 వందల కిలోమీటర్లు చేరిన సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేశారు. ఎస్సీ, ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. వీరబాబు, జ్యోతిబసు రజిత, అమీర్, జశ్వంత్ పాల్గొన్నారు.

వానలే వానలు..

దోర్నకల్: పొంగిపొర్లుతున్న మున్నేరు వాగు



కురవి: స్టేషన్‌గుండ్రాతిమడుగు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు వాగు



గంగారం: కోమట్లగూడెంలో వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క






దోర్నకల్: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కొత్తగూడ: ఉప్పొంగి ప్రవహిస్తున్న ముస్మి వాగు

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. బుధవారం కురవి మండలంలోని నేరడ గ్రామంలోని పెద్ద చెరువు అలుగుపోస్తోంది. డోర్నకల్‌లో మున్నేరువాగు ఉగ్రరూపం దాల్చింది. మరిపెడ మండలంలోని వాల్యతండాలో రైతు తేజావత్ రమేష్‌కు చెందిన ఆవు విద్యుత్ తీగలకు చిక్కుకొని మృతి చెందింది. గార్ల సమీపంలోని పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్ల నుంచి రాంపురం, మద్దివంచ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. - సాక్షి నెట్‌వర్క్



బయ్యారం: పాండవుల జలపాతం వద్ద సందర్శకుల సందడి



మరిపెడ రూరల్: వాల్యతండాలో మృతి చెందిన ఆవును తొలగిస్తున్న తండావాసులు



గార్ల: పాకాల ఏరు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో నిండుకుండలా పెద్దచెరువు



చిన్నగూడూరు: మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

మృతదేహం గుర్తింపు

డోర్నకల్: డోర్నకల్–ఖమ్మం రైలు మార్గంలో పాపటపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు పట్టాల ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పాపటపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో డౌన్‌లైన్ వద్ద కిలోమీటర్ నంబర్ 465/22–24 వద్ద రైలు పట్టాల ప్రక్కన గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని కనుగొన్నట్లు తెలిపారు. మృతుడు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడు తెల్ల గీతలు కలిగిన నలుపురంగు షర్టు, బ్రౌన్ కలర్ పాయింట్ ధరించి ఉన్నాడని, అన్నం ఫౌండేషన్ ప్రతినిధుల సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58600. 94947 90619 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పింఛన్ కోసం వెళ్లి గుండెపోటుతో మృతి



గూడూరు: పింఛన్ కోసం ద్విచక్ర వాహనం వెనకాల కూర్చొని వెళ్లిన వృద్ధుడు, దిగుతూ కింద పడి గుండెపోటుతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని బొల్లెపల్లిలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బండారి కనకయ్య (70) పద్మకు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉండగా వారికి పెళ్లిలు అయ్యాయి. కనకయ్య ఉదయం ప్రభుత్వం అందించే వృద్ధాప్య పింఛన్ కోసం ఒకరి ద్విచక్ర వాహనంపై పోస్టాఫీసుకు వెళ్లాడు. అక్కడికి చేరుకున్నాక బైక్ దిగుతూ కిందపడిపోయాడు. అదేసమయంలో అతనికి గుండెనొప్పి వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు.

ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యం



పురాతన బావిని పరిశీలిస్తున్న బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్: మానుకోట పట్టణాన్ని అభివృద్ధి చేశాం అని, గొప్పలు చెప్పుకునే అంశం కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలో శూన్యమని మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని 20వ వార్డులో బలరాంనాయక్ బుధవారం పత్తిపాక రోడు, వీధులను సందర్శించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బలరాంనాయక్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఒక్కసారి 20వ వార్డు వీధులను సందర్శిస్తే ఏ మేరకు అభివృద్ధి చేశారో వారికే అర్థమవుతుందని తెలిపారు. పత్తిపాక రోడ్డు వెడల్పు చేయడానికి రెండున్నర, మూడు సంవత్సరాలు పడుతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహించటంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, వార్డు కౌన్సిలర్ జగన్, నాయకులు సత్రాం, విజయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గూడూరు: మండల కేంద్రంతో పాటు సీతానగరం, భూపతిపేట గ్రామాలలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను బుధవారం మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ పరామర్శించారు. వారికి అండగా ఉంటామని, కొంత ఆర్థిక సాయం అందించారు. అనంతరం సీతానగరంలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెల్సుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ తనవర్గంతో మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

మహబూబాబాద్ రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతులు అర్హులని, 5 ఎకరాల లోపు ఉన్న పట్టదారులు (మొత్తం కుటుంబ సభ్యులది కలిపి), ఉపాధి జాబ్ కార్డు, బోరుబావి కలిగి ఎలక్ట్రిసిటీ కలిగిన ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు దరఖాస్తు పత్రం, పట్టా పాసు బుక్కు, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డు, ఉపాధి జాబ్ కార్డ్, పాన్‌కార్డు జిరాక్స్‌లు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు(3), గ్రామపంచాయతీ తీర్మానం తీసుకుని జిరాక్స్‌లతో పంచాయతీ సెక్రటరీ లేదా ఏఈఓ లేదా ఈజీఎస్ ఏపీఓకి దరఖాస్తు సమర్పించాలన్నారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి (గట్ల వెంబడి మాత్రమే), డ్రాగన్ ఫ్రూట్, సపోటా, ఆయిల్ ఫామ్, బత్తాయి, అల్లనేరేడు తోటలు సాగు చేసేందుకు నిర్ణయించారని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా మైక్రో ఇరిగేషన్ ఉంటుందని తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని వివరించారు.

సీఎం సారూ.. మమ్మల్ని పట్టించుకోండి



మహబూబాబాద్ రూరల్: నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు



కొత్తగూడ: జీపీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

మహబూబాబాద్ రూరల్: సీఎం కేసీఆర్ సారూ మమల్ని పట్టించుకోండి అంటూ గ్రామ పంచాయతీ కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సమ్మె కొనసాగిస్తున్న జీపీ కార్మికులు బుధవారం వర్షం కురుస్తున్నప్పటికీ అక్కడే ఉండి తడుస్తూనే సమ్మెలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పరిష్కరిస్తాం..

కొత్తగూడ: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరిస్తామని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలకేంద్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనంతరం మండలంలోని పొంగుతున్న వాగులను పరిశీలించారు. వాగులపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం కోసం ఐటీడీఏ పీఓకు విన్నవిస్తానని హామీ ఇచ్చారు.

గూడూరు: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేస్తూ, పలు సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు బుధవారం మండల కేంద్రంలో చెవిలో పువ్వులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, వెంకన్న, మోహినొద్దీన్, సత్యనారాయణ, ఉప్పలయ్య, ముత్తయ్య, ఐలయ్య, వెంకటేశ్, వెంకటయ్య, లక్ష్మయ్య, వీరమల్లు, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో జీపీ కార్మికులు వర్షంలో సైతం సమ్మె చేశారు. కార్యక్రమంలో సంఘాల మండల అధ్యక్షులు జాటోత్ మంగీలాల్, రాములు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: మండలంలో ప్రధాన సమస్య అయిన పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించడంలో పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టబోయిన శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గార్లలో పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి సైతం బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే ప్రజాప్రతినిధులను తిరగనివ్వకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మండల కార్యదర్శి వెంకన్న, రమేష్, కృష్ణమూర్తి, జనార్దన్, లోకేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎంఆర్‌ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే శంకర్‌నాయక్ లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, నాయకులు వెంకన్న, రవి, రంజిత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే రక్షణ..

- వ్యవసాయ మోటార్ల వద్ద అప్రమత్తత అవసరం
- వర్షాకాలం పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు



కురుస్తున్న వర్షానికి నేలకూలిన విద్యుత్ స్తంభం (ఫైల్)

నెహ్రూసెంటర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, స్టార్టర్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అలాగే ఇళ్లల్లోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాగా రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చు.

వ్యవసాయ మోటార్ల వద్ద..

వానాకాలంలో వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, స్టార్టర్లను తడి చేతితో తాకొద్దు. ఏదైనా సమస్య వస్తే సొంతంగా మరమ్మతులు చేయకుండా ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలి. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు వస్తే అధికారులకు సమాచారాన్ని అందించాలి.

ప్రమాదాలు ఇలా..

వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున విద్యుత్‌తీగలు తెగిపడడం, విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రైతులు, ప్రజలు వానాకాలం విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో తీగలపై దుస్తులు ఆరేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వర్షానికి తడిసిన గోడలను, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు.

విద్యుత్ అధికారులకు తెలియజేయాలి

వర్షాల వల్ల పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూలడం, తీగలు తెగితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. రైతులు వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. పాత వైర్లకు బదులుగా కొత్త వైర్లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలి.

- జె.నరేష్, ఎస్ఈ, మహబూబాబాద్

సంక్షిప్త సమాచారం

మెనూ ప్రకారం భోజనం అందించాలి

గూడూరు: వర్షాలు కురుస్తున్నందున వసతి గృహంలో బాలికలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని బుధవారం తనిఖీ చేశారు. వంటశాలను, ఆహార పదార్థాలను, గదులలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వార్డెన్ రజినీతో పిల్లలకు సమయానుకూలంగా మెనూ ప్రకారం వేడివేడి భోజనం అందించాలన్నారు.

బియ్యం అందజేత



పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామంలో ఇటీవల మాంకాల చంద్రయ్య, చింత లక్ష్మి, అనారోగ్యంతో మృతిగా బుధవారం బాధిత కుటుంబాలను గ్రామానికి చెందిన తోటకూరి శ్రీనివాస్ చెరో 50 కేజీల బియ్యం అందజేశాడు. అలాగే అదే గ్రామానికి చెందిన అచ్చయ్య చారి మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం చేశాడు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మరిపెడ రూరల్: ఇటీవల ఏర్పాడిన అల్పపీడనంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయని, సెలువులు ఉన్నందున విద్యార్థులు ఇంటి నుంచి బయటకు రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కీసర రమేష్ రెడ్డి, కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్ బుధవారం సూచించారు.

కాపుసారా విక్రయదారుడి అరెస్ట్

గార్ల: గార్ల మండలం అంజనాపురం గ్రామంకు చెందిన బానోత్ భరత్ బైక్‌పై గార్లకు వస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు బైక్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 15లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న వెల్లడించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గార్ల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) టెక్నాలజీని ఉపయోగించి సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన మాలోత్ లచ్చు తన సెల్‌ఫోన్‌ను కుమారుడికి ఇవ్వగా ఖమ్మంలో పరీక్ష వ్రాసేందుకు వెళ్లి పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖమ్మంలో ఓ మహిళ దగ్గర సెల్‌ఫోన్‌ను గుర్తించి, ఆమె వద్ద నుంచి సెల్‌ఫోన్ తెప్పించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంత పూడ్చివేత

గార్ల: 'గుంతను పూడ్చాలి' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో 5రోజుల క్రితం ప్రచురితమైన కథనానికి స్పందించిన సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ బుధవారం రహదారిపై ప్రమాదభరితంగా ఉన్న గుంతను కార్మికులచే పూడ్చించారు.

మత్తడి ధ్వంసం

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలోని ఊరచెరువు మత్తడిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ధ్వంసం చేశారు. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పోతుందని పలువురు రైతులు వాపోతున్నారు. మత్తడిని ధ్వంసం చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ సాంబశివుడు తెలిపారు.

జర్నలిస్టుల పోస్టుకార్డు ఉద్యమం

మరిపెడ: రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మరిపెడలో జర్నలిస్టులు పోస్టుకార్డులను సీఎం కేసీఆర్‌కు పోస్ట్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీశైలం, అక్తర్‌పాష, లచ్చయ్య, రాజేష్, సంజీవ, శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



గూడూరు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ఏజెన్సీ గ్రామాల్లో పూర్తి స్థాయిలో అమలుచేయాలని ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్న నాయక్ కోరారు. మండలంలోని ఏపూరుకు చెందిన ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ బుధవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

పీరీల సందడి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బేతోలు గ్రామంలో ముస్లింలు బుధవారం పీరీల సవార్ల సందడి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి



మరిపెడ: అమరవీరులను ప్రతి భారతీయుడు స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. కార్గిల్ అమరుల దివస్ సందర్భంగా కార్గిల్ అమరుల స్థూపానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్గిల్ స్థుపం నిర్మించిన కార్గిల్ సొసైటీ చైర్మన్ గాదే రాంబాబును ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, నాయకులు రాంలాల్, శ్రీనివాస్‌రెడ్డి, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: దేశ సరిహద్దుల్లో కాపలా ఉండి ప్రజలను కాపాడుతున్న సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు తక్కెళ్లపల్లి రవీంద్ర అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్‌లో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు.